వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

సోమవారం 23 జనవరి 2023


## రోడ్డు ప్రమాదంలో బాలుడు దుర్మరణం

బద్వేలు జనవరి 22, ప్రభాతవార్త



కడప జిల్లా బద్వేలు పట్టణంలో రోడ్డు దాటుతున్న పిల్లలను ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో మాధవ్ (8) అనే బాలుడుమృతిచెందగాతనూష్ అనే బాలుడు గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. బద్వేలు పట్టణానికి చెందిన మాధవ్, తనూష్ ఇద్దరు అన్నదమ్ములు. వీరి తల్లి దండ్రులు మైదుకూరు రోడ్డులో కూల్ డ్రింక్ షాప్ నడుపుకుంటు న్నారు.బద్వేలు పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో మాధవ్ 4వ తరగతి తనూష్ రెండోవ తరగతి చదువుచున్నారు. అయితేఆదివారం రాత్రి 7.30 గంటల సమయంలో మాధవ్,తనూష్ లు మైదుకూరు రోడ్డులో రొడ్డు దాటుచుండగా బద్వేలు డిపో బ్రహ్మంగారి మఠం వెల్లుచున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈప్రమాదం లో మాధవ్ అక్కడిక క్కడే మృతి చెందాడు.తనూష్ కు చెయ్యి విరిగింది.ఇద్దరిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారి స్తున్నారు.తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రామాపురం.జనవరి22 ప్రభాతవార్త



రామాపురం మండలం కుమ్మరపల్లి గ్రామ పంచాయతీ కేంద్రంలో మాజీ సర ్పంచ్ సదిపిరాళ్ల రామ్ బసిరెడ్డి ఆద్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి సందర్శించారు. వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయ మంటూ నిర్వాహకులు రామ్‌బసిరెడ్డిని అభినం దించారు. ఉచిత వైద్య శిభిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాంత్‌రెడ్డి ఆకాంక్షించారు. రాయచోటికి చెందిన జనతా ఆసుపత్రి వైద్యులు మడితాటి నాగిరెడ్డి బృదం రోజులకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ఎంపిటిసి ఖాదర్‌వలి, డీలర్ జయ రామిరెడ్డి, గురుమూర్తి, జమాల్ వలి, షఫీ, చంద్ర పాల్గొన్నారు.

# భద్రతా చర్యల మధ్య పోలీసుల రాత పరీక్ష

- జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్







కడప క్రైం, ప్రొద్దుటూరు క్రైం, జనవరి 22, ప్రభాతవార్త:

పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన ఎస్పి

జిల్లాలో ప్రారంభమైన కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక పరీక్షల ప్రక్రియ ఆదివారం భద్రతా చర్యలతో ప్రారంభమయ్యాయి. జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పోలీసు రాత పరీక్ష కేంద్రాలు కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కాలేజీ, కోటిరెడ్డి మహిళా డిగ్రీ కాలేజీ, అలాగే ప్రొద్దుటూరులో సీబీఐటీ కాలేజీలలో అభ్యర్థుల ఐడీ కార్డులు, హాల్ టికెట్‌లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలోని కడప, ప్రొద్దుటూరులోని మొత్తం 71 కేంద్రాల్లో పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రిలిమినరీ పరీక్షలు జరుగుతున్నాయని పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ప్రతి సెంటర్‌లో ఒక ఎస్సై, 10 మంది సిబ్బందితోభద్రత ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని కడప, ప్రొద్దుటూరులోని పరీక్ష కేంద్రాల్లో 800 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు. ప్రతి రెండు సెంటర్లకు సీఐ స్థాయిలో, ప్రతి నాలుగు సెంటర్లకు డీఎస్పీ స్థాయిలో ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేశామని వివరించారు. అభ్యర్థులకు రవాణా పరంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆర్టీసీ అధికారులతో మాట్లాడి ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు.

చాపాడు : మండల పరిధిలోని సిబిఐటి ఇంజనీరింగ్ కళాశాల యందు ఆదివారం నిర్వహించిన పోలీసు ప్రాథమిక పరీక్ష కేంద్రాలలో జిల్లా పోలీసు ఉన్నతాధికారి. కేకేఎన్ అంబురాజన్ తనిఖీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని కడప. ప్రొద్దుటూరు లోమొత్తం 71పరీక్ష కేంద్రాలలో పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షలు జరుగుతున్నాయి అన్నారు.ఈ పరీక్షలకు పకడ్బందీ భద్రత ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో ఒక ఎస్సై పదిమంది సిబ్బందితో ,ప్రొద్దుటూరు, కడప పరీక్ష కేంద్రాల యందుఎనిమిది వందల మంది పోలీసు అధికారులు, సిబ్బందితో ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రతి రెండు సెంటర్లకు సీఐ స్థాయిలో, ప్రతి నాలుగు సెంటర్లకు డిఎస్పి స్థాయిలో ఫ్లయింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రవాణా పరంగా అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ అధికారులతో మాట్లాడి ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు . ఈయన వెంట మైదుకూరు డిఎస్పి, వంశీధర్ గౌడ్. రూరల్ సీఐ నరేంద్ర రెడ్డి. పలువురు పోలీస్ అధికారులు ఉన్నారు.

# కొండలపై కబ్జాదారుల కన్ను





- కొండలను సైతం పిండి చేస్తున్న వైనం
- అడ్డే లేకుండా పోతున్న కబ్జాదారులు
- కొండలను చదును చేసి ప్లాట్లు ఏర్పాటు
- లక్షల్లో క్రయ విక్రయాలు
- పట్టించుకోని రెవిన్యూ అధికారులు

బద్వేలు, జనవరి 22 ప్రభాతవార్త :

సహజ సిద్ధంగా ఏర్పడిన కొండలు, చెరువులు, కుంటలను సైతం బద్వేలులో కబ్జాదారులు ఇష్టానుసారంగా కబ్జాలు చేస్తున్నా పట్టించుకునే నాధుడే లేరనే విమర్శలు ఉన్నాయి. పట్టణంలోని మడకలవారిపల్లె పరిధిలో సహజ సిద్ధంగా ఏర్పడిన కొండలను సైతం పిండి చేస్తున్నారు. పట్టణంలోని నెల్లూరు రోడ్‌లోని పోలేరమ్మ తిప్ప వెనుక భాగాన ఉన్న కొండను ఇష్టానుసారంగా త్రవ్వుతూ చదును చేస్తున్నారు. రోడ్డుకు ఆనుకొని ఉన్న కొండలను కూడా పిండి చేసి ప్లాట్లు ఏర్పాటు చేస్తున్నా రెవిన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారే తప్ప ఏమాత్రం చర్యలు తీసుకున్న పాపాన పోలేదని విమ ర్శిస్తున్నారు. నేషనల్ హైవేకు 100 మీటర్ల లోపే ఉన్న ఈ కొండను కొద్ది రోజులుగా కొందరు వ్యక్తులు త్రవ్వుతూ ప్లాట్ల రూపంలో అమర్చుకుంటూ లక్షల్లో విక్రయాలు జరుపుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. పేద వాడు సెంటు ఆక్రమిస్తేనే పరుగులు పెట్టే అధికారులు కొద్ది నెలలుగా జేసీబీతో సమయం వచ్చినపుడల్లా కొద్ది కొద్దిగా కొండను త్రవ్వుతూ వచ్చిన మట్టిని సైతం అమ్ముకుంటూ కొండ రాళ్ళను అమ్ముతూ వ్యాపారాలు సాగిస్తుంటే చూస్తున్నారు. ఎక్కడో అడవులలోనో, ఊరు చివర్లో చేస్తే కనుక్కోవడం కష్టతరం కావొచ్చు, నిత్యం లక్ష లాది మంది తిరిగే రహదారి గుండా సచివాలయాలకు దగ్గరగా, తహసీల్దారుకు కార్యాలయానికి దగ్గరలో ఇంత దారుణం జరుగుతుంటే ఎందుకు పట్టించుకోవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఏ ఆధారాలు లేకుండా కొండను త్రవ్వుతూ మమ్మల్ని ఎవరూ ఆపుతారనే ధైర్యంతో ముందు కెళ్తున్న వారికి అధికారులు కళ్ళె వేయరా? ఇదిలా ఉంటే సిద్ధ వటం రోడ్‌లోని మహమ్మద్ కాలని చివర ఉన్న కొండను సైతం చదునుచేసి రహదారులు ఏర్పాటు చేసుకొని ప్లాట్లు ఏర్పాటు చేస్తున్నారు. కొండలకు ఇంటిస్థలాల పట్టాలు ఇచ్చిన దాఖలాలు చరిత్రలో ఎక్కడైనా ఉంటాయా? ఉండవు, బద్వేలులో మాత్రం అవి కనపడుతాయి. కొండను చదును చేస్తూ బేస్‌మట్టాలు వేసి రూములు నిర్మించుకొని దొంగ పట్టాలు సృష్టించుకొని మాదే అన్న ధైర్యంతో వ్యాపారాలు సాగిస్తున్నారు. కొండలు, గుట్టలు, చెరువులు, కుంటలు బద్వేలులో కనుమరుగయ్యే పరిస్థితి కనపడుతుంది. నిత్యం కబ్జాదారులు ఎక్కడ కబ్జా చేయాలి? ఎక్కడ ప్రభుత్వ స్థలాలున్నాయి? అనే వాటిపై దృష్టి పెడుతూ ఎక్కడ ఖాళీ స్థలాలు కన పడితే అక్కడ పాగా వేస్తూ రెవిన్యూ అధికారులకే సవాల్ విసురుతున్నారు. ఈ మధ్యకాలంలో ఆర్డీవో వచ్చాక కబ్జాలు తగ్గాయని అనుకున్నప్పటికీ లోలోపల చేస్తూనే ఉన్నారు. ఆధారాలు లేకున్నా కొండను సైతం పిండి చేస్తూ లక్షల్లో విక్రయాలు జరుపుతున్నారు. ఇప్పుడున్న ఆర్డీవో నిబం ధనల ప్రకారం రాళ్ళు గానీ, మట్టి గానీ తోలేందుకు వీలు లేదని హెచ్చరించినా కొండను త్రవ్వి మట్టి, రాళ్ళు వాడుకోవడమేగాక పట్టాలు కూడా సృష్టిస్తున్నారు. ఇదంతా మహమ్మద్ కాలనీ చివర ఉన్న కొండకు కబ్జా దారులు ఎసురు పెట్టారు. ఇప్పటికైనా రెవిన్యూ అధికారులు ఇలాంటి వారిపై కఠినచర్యలు తీసుకోకపోతే బద్వేలులో కొండలు, గుట్టలు, చెరువులు కనుమరుగ య్యే పరిస్థితి ఏర్పడుతుందని పలువురు వాపోతున్నారు.

# రహదారులు నరకం చూపిస్తున్నాయ్...!

-అధ్వానంగా పట్టణ రహదారులు -ప్రజలుకు మాత్రం తప్పని తిప్పలు





రాయచోటి.జనవరి22 ప్రభాతవార్త

రాష్ట్రంలోని అన్ని జిల్లా కే ంద్రాలకు రాయచోటి పట్టణం సౌకర్యాల విషయంలో తేడా స్పష్టంగా కనిపిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ ఇంటింటికి మంచి నీరు అంటూ పట్టణంలోని రహదారులన్నీ తవ్వి పారేసింది. అయితే వేసిన సిమెంట్ రోడ్ల నాణ్యత లేకపోవడం అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులు పూర్తి కాకపోవడంతో రోడ్లన్నీ అస్తవ్యస్తంగా ఉన్నాయి. పట్టణంలో ఏ రహదారి చూసిన ప్రజలకు వాహనదారులుకు చుక్కలు చూపిస్తున్నాయి. అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ కోసం తవ్విన రోడ్ల స క్రమంగా పూడ్చకపోవడంతో ప్రజలకు వాహనదారులకు చాలా ఇబ్బందిగా ఉంది. రద్దీగా ఉండే జగదాంబ సెంటర్ ఎన్జీవో కాలనీరోడ్, పేరయ్య వీధి, ఖాదర్ హుస్సేన్ బిట్లు, తిరుపతినాయుడు కాలనీ, ఎస్ఎన్ కాలనీలలో సిమెంట్ రోడ్లు లేక మట్టి రోడ్లలో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది వేసిన సిమెంట్ రోడ్లు ధ్వంసం అయిపోయాయి. మరికొన్ని చోట్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం తవ్వేసిన రోడ్లు వెక్కిరిస్తూ కనబడుతున్నాయి. అలాగే వెలిగల్లు ప్రాజెక్ట్ నుంచి వచ్చే మంచి నీటి కోసం పైపులైన్‌లు కుళాయి కనెక్షన్ కోసం రోడ్లను ఇష్టానుసారంగా వేయడం తర్వాత వాటిని పూడ్చి సిమెంట్ రోడ్డు వేయకపోవడంతో గుంతలమయమైంది. గత ప్రభుత్వంలో వేసిన సిమెంట్ రోడ్ల నాణ్యతను తిలోదకాలు ఇచ్చారు. మున్సిపాలిటికి అత్యధిక ఆదాయం వస్తున్నా అధికారులు అభివృద్ధి చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. పట్టణంలోని అంతర్గత రహదారులన్నీ గుంతలమయం అయ్యాయి. మున్సిపల్ కౌన్సిలర్లు కూడా వారి వార్డుల్లో అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. పనులు చేస్తే బిల్లులు రావడం లేదని దాని కోసం పని చేయడం లేదని కొందరు కౌన్సిలర్‌లు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారు. పట్టణంలోని కొత్తపల్లిలో డ్రైనేజిలు లేక విధులు మద్యలో మురుగు నీరు ప్రవహిస్తుండడంతో ప్రజలు మురుగునీటిలోనే నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తుంది. డ్రైనేజీ, రోడ్లు లేక కొత్తపల్లి ప్రాంతం దుర్భరంగా ఉన్నది. ఈ ప్రాంతంలో మైనార్టీ ప్రజలు అధికంగా ఉన్నారు. ఎన్నికల సమయంలో వీరికి కల్లబొల్లి మాటలు చెప్పి ఓట్లు వేయించు కోవడం తర్వాత వీరికి ఎలాంటి అభివృద్ధి చేయడం లేదని వారు ఆరోపిస్తున్నారు. శుక్రవారం మైనార్టీ సోదరులు మసీదుకు వెళ్లాలంటే ఈ మురుగు నీరు తొక్కుతూ మసీదుకు వెళ్లాల్సి వస్తుందని తెలియ జేశారు. మున్సిపల్ అధికారుల ఏ మాత్రం ఇంటి పన్ను, చెత్త పన్ను. నీటి పన్ను క్రమం తప్పకుండా వసూలు చేస్తున్నారు. ప్రజలకు కనీసం మౌళిక వసతులు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇకనైనా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుని కనీస మరమ్మత్తులు రోడ్లకు చేయాలని డ్రైనేజీలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

## జగనన్న పాలనలో ఇంటింటా సంక్షేమ లబ్ది

- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

గాలివీడు.జనవరి22 ప్రభాతవార్త



జగన్ పాలనలో అర్హులందరికి సంక్షేమ ఫలాలు అందుతుండడం వల్ల ఇంటింటా సంతోషం ఉందని అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సిపి అద్యక్షుడు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివార గాలివీడు మండలం గుండ్ల చెరువు గ్రామంలో గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమాన్ని స్థానిక ప్రజా ప్రతి నిధులు, అధికారులతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటా తిరుగుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు నేరుగా లబ్దిదారు లకు అందుతున్నాయా లేదా అని తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు చేరలేదని తమ దృష్టికి వస్తే వెంటనే స్థానిక అధికారులతో చర్చించి వెంటనే వచ్చే విధంగా ఏర్పాటు చేశారు. జగనన్న పాలనలో ప్రతి ఒక్కరికి న్యాయం చేకూరేలా పాలన సాగుతోందని తెలిపారు. గడప గడపనా జిల్లా సాధకుడికి మహిళలు హారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి జల్లా సుదర్శన్‌రెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ విశ్వనాధరెడ్డి, వైస్ ఎంపిపి యదుబూషణ్‌రెడ్డి, మండల మైనార్టీ నాయకులు ఎస్.కె.ఖాదర్‌మోహిద్దీన్, సర్పంచ్‌లు, ఉమాప్రభాకర్, ఉమాపతి రెడ్డి, కేశవరెడ్డి, రాష్ట్ర వైసిపి యువజన విభాగం ప్రధాన కార్యదర్శి అమర్‌నాధ రెడ్డి, భానుమూర్తి, వెంకటశివారెడ్డి, బసిరెడ్డి, తంగాల వేణుగోపాల్, రమణారెడ్డి, కూరగాయల సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

## పోలీసులు శాంతిభద్రతలు కాపాడాలి

ఓబులవారిపల్లె, జనవరి 22, ప్రభాతవార్త:

ఓబులవారిపల్లె మండలంలో తరచూ కొన్ని గ్రామ పంచాయతీల్లో చిన్న చిన్న గొడవలు చిలికి చిలికి గాలివానలా పెద్ద ఘర్షణలకు తావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీసులు కొంత మంది బడా బాబులు పరపరతి ఉన్న వారు రాజకీయ నాయకుల రాజకీయ క్రడలో భాగమై పోలీసు జుళుం ప్రదర్శిస్తున్నారని గ్రామాల్లో ఎటు చూసినా గుస గుసలు వినిపిస్తున్నాయి. మరో పక్క పోలీసులకు సమాచారం అందించినా ఆలస్యంగా స్పందించడం వాటిపై చర్యలూ లేకపోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల మంగంపేటలో మేజర్లు ప్రేమించుకొని పెళ్లి చేసుకున్నా చట్టాలను తుంగలో తొక్కి కొందరు రాజకీయ నాయకులు పరపతి ఉన్న వారు ఫోన్ల ద్వారా విడిపించాలని చెప్పడంతో పోలీసుల ఎదుటే ఒక యువకుడిని గొడ్డును బాదినట్లు విచక్షణా రహితంగా దాడి చేయడం హేయమైన చర్య లని పలువురు విమర్శిస్తున్నారు. అదే కాకుండా కొత్త మంగంపేటలో శనివారం రాత్రి జరగిన గొడవలో ఇరువర్గాలు దాడి చేసుకోవడం ఒక వ్యక్తిని నలుగురు దాడి చేసి గాయపరిచి రాజకీయ పరపతి ఉపయోగించి గాయాలపాలైన వ్యక్తిపైనే కేసులు బనాయించడం ఏమిటని ప్రజా సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఏది ఏమైనా పోలీసులు న్యాయబద్ధంగా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు గ్రామాల్లో గుప్పిస్తున్నాయి. ఇప్పటికైనా పోలీసు అధికారులు న్యాయబద్దంగా వ్యవహరిం చాలని కింది స్థాయి పోలీసు అధికారులకు తెలిపి చర్యలు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల ప్రజలు కోరుతున్నారు.

## ముగిసిన రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు

II లో

# అంగన్‌వాడీల్లో స్మార్ట్ సేవలు

- కేంద్రాల్లో సాంకేతికత మేళావింపు
- నిర్వహణలో అక్రమాలకు చెక్
- రోజువారి విధులు నిర్వహణకు ప్రత్యేక యాప్‌లు

రాయచోటి.జనవరి22 ప్రభాతవార్త



ప్రభుత్వ శాఖల్లో పనితీరు మెరుగుకు సర్కారు చర్యలు చేపడుతుంది. క్షేత్రస్థాయిలో ప్రీ ప్రైమరీ విద్యనందించే అంగన్‌వాడీ కేంద్రాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే కేంద్రాల ద్వారా చిన్నారులు, బాలింతలు, గర్భిణీలకు మెరుగైన సేవలు అందిస్తోంది. ఈ సేవలకు సక్రమంగా అందించేందుకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో స్మార్ట్ సేవలకు శ్రీకారం చుట్టుంది. సాంకేతికతను మేళావించడంతో పటిష్టమైన ప్రణాళికతో లక్ష్యాలను చేరుకునేలా చర్యలు చేపట్టింది. జిల్లాలో 2275 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు లక్షా 10వేల 624 మంది లబ్దిపొందుతున్నారు. వీరికి సమకూర్చే పౌష్టికాహారం ఆరోగ్యరక్షణ, పారిశుద్యం, త్రాగునీరు తదితర మౌళిక వసతులు కల్పనలో ఎలాంటి లోటుబాట్లు అక్రమాలకు తావులేకుండా ప్రత్యేక యాప్‌లు రూపొందించారు.

**అన్నమయ్య జిల్లాలో ఇలా.....**

అంగన్‌వాడీ కేంద్రాలు 2275, అంగన్‌వాడీ ప్రాజెక్ట్‌లు 9, ప్రధాన కేంద్రాలు 1858, మినీ కేంద్రాలు 417, సూపర్ వైజర్‌లు 80, అంగన్‌వాడీ కార్యకర్తలు 2188, స్మార్ట్ ఫోన్‌లు పొందిన సిబ్బంది 2275, సేవలు పొందుతున్న గర్భిణీలు 11052, బాలింతలు 11,275, మూడు నెలల నుంచి మూడేళ్ల పిల్లలు 52579, మూడేళ్ల నుంచి ఆరేళ్ల పిల్లలు మొత్తం లబ్దిదారుల సంఖ్య 35718 ఉన్నారు.

**పారదర్శక సేవలకే యాప్‌లు :** కేంద్రాలలో పనితీరు మెరుగు, నిరంతరం పర్యవేక్షణకు సంబంధించి స్మార్ట్ ఫోన్‌లు అందించారు. వీటి సాయంతో పారదర్శకమైన సేవలు అందించే అవకాశం ఉంది. ఈ ఫోన్‌లో ఇప్పటికే రెండు యాప్‌లు అనుసందానం చేసి వాటి ద్వారా రోజు వారి విధులు పర్యవేక్షిస్తున్నారు. మరో నాలుగు యాప్‌లు ప్రవేశబెట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు అధికారులు పేర్కొంటున్నారు. పారిశుద్యం లోపిస్తే యాప్‌లో వివరాలు నమోదు చేస్తే సంబందిత పంచాయతీ కార్యదర్శికి సమా చారం వెళ్తుంది. వెంటనే సిబ్బంది అక్కడకి చేరుకుని పారిశుద్య పనులు చేపడతారు. బోజనంలో నాణ్యత లోపిస్తే యాప్‌లో వివరాలు నమోదవుతాయి. మెనూ ప్రకారం నాణ్యమైన బోజనం అందించని అంగన్‌వాడీ కేంద్ర వివరాలను యాప్‌లో నమోదు చేస్తారు. తద్వారా బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు మరుగుదొడ్లు వినియోగించేందుకు నీరు అందుబాటులో ఉంచాలి. లేని పక్షంలో యాప్‌లో వివరాలు నమోదు చేస్తే సమాచారం ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ అధికారులకు చేరుతుంది. ఆ శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదికన నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు. లబ్దిదారులు అందించే గుడ్ల సరఫరాకు ప్రత్యేక యాప్ అందు బాటులోకి రానుంది. ఆయా కేంద్రాలకు గుడ్ల ఏజెన్సీలు సక్రమంగా సరఫరా చేస్తున్నాయా, వాటి పరిమాణం, నెలవారి రోటా, స్టాంపింగ్, గుడ్ల నాణ్యత వివరాలు ఆ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది.

**పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ :** జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల లబ్దిదారులకు మద్యాహ్న బోజనంతో పాటు కోడిగుడ్లు, పాలు, బాలామృతం, అటుకులు, రాగిపిండి, జొన్నపిండి, కర్జూరం, బెల్లం చిక్కీలతో కూడిన కిట్లను సరఫరా చేస్తున్నారు. పౌష్టికాహారం పంపిణీ పటిష్టంగా (మిగతా IIవ పేజీలో)

# వారంలోగా ఇళ్ల నిర్మాణంలో పురోగతి కనిపించాలి

## జగనన్న కాలనీ లేఔట్‌లో ఇళ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించిన కలెక్టర్

- స్టేజ్ అప్డేషన్ మీద ప్రత్యేక దృష్టి పెట్టండి
- పురోగతి కనిపించకపోతే చర్యలు తప్పవు

రాయచోటి.జనవరి22 ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నవరత్నాలు పేదలందరికి ఇళ్ల పథకంలో భాగంగా నారాయణరెడ్డి పల్లి జగనన్న లేఔట్‌లో వచ్చే వారంలోగా ఇళ్ల నిర్మాణంలో పురోగతి కనిపించాలని అధికారులను జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్ ఆదేశించారు. ఆదివారం రాయచోటి అర్బన్ పరిధిలోని నారాయణరెడ్డిపల్లి జగనన్న కాలనీ లేఔట్‌లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను జిల్లా కలెక్టర్ ద్విచక్రవాహనంపై వెళ్లి క్షే త్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా లేఔట్‌లో నిల్వ ఉంచిన సిమెంట్ గోదాం, ఇతర సామాగ్రిని కలెక్టర్ పరిశీలించారు. ఎన్ని బస్తాల సిమెంట్ నిల్వ ఉంది, ఇంకా ఎంత సిమెంట్ ఇండెంట్ పెట్టారు వంటి వివరాలను కలెక్టర్ హౌసింగ్ పిడిని అడిగి తెలుసుకున్నారు. బిల్లులు మంజూరు విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఇంజనీర్ అసిస్టెంట్‌లను హెచ్చరించారు. ఆర్ఎల్ స్టేజీలో ఉన్న ఇళ్లన్నీ త్వరగా పూర్తి చేయాలన్నారు. ఫైనల్ స్టేజ్‌లో ఉన్న ఇళ్లు 150 ఉన్నాయని, వాటి పూర్తి కోసం మెప్మా అధికారులు లబ్దిదారులకు రుణం ఇప్పించాలన్నారు. ప్రతి శనివారం లేఔట్ విజిట్ చేస్తానని, పురోగతి కనిపించకపోతే మాత్రం వేటు తప్పదని ఇంజనీర్ అసిస్టెంట్‌లను కలెక్టర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ రాంబాబు, హౌసింగ్ పిడి శివయ్య, ఇతర శాఖల అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, తదితరులు పాల్గొన్నారు.

## కోసువారిపల్లెలో స్వామి వారి ధ్వజారోహణ కార్యక్రమం

తంబళ్లపల్లె, జనవరి 22, ప్రభాతవార్త:



తంబళ్లపల్లె మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారి ధ్వజా రోహణ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భం గా టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మీ, సూపరింటెండెంట్ చంగల్‌రాయలు సారథ్యంలో ప్రధాన అర్చకుడు విశ్వనాథ్ భట్టర్ ఆధ్వర్యంలో వేద పండితులు మంత్రోచ్చారణల, మంగళ వాయిద్యాలతో స్వామి వారి ధ్వజారోహణ కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, ధూపదీప నైవేద్యాలు, ఆకు పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారితో పాటు దేవేరులకు పూజలు అనంతరం వేద పండితులు పల్లకి సేవ నిర్వహించారు. గ్రామ, మండల ప్రజలు పల్లకి సేవ చూసి తరించారు.

# పటిష్ట పోలీస్ బందోబస్తు మధ్య కానిస్టేబుల్ పరీక్షలు

**857మంది అభ్యర్తులు గైర్హాజరు**

**పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా ఎస్‌పి**

మదనపల్లెక్రైం, జనవరి 22 ప్రభాతవార్త:



పటిష్ట పోలీస్ బందోబస్తు మధ్య కానిస్టేబుల్స్ రాత పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షా కేంద్రాలను జిల్లా ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు తనిఖీ చేశారు. 857మంది అభ్యర్థులు పరీక్షలకు గైర్హాజరు అయ్యారు. మదనపల్లె పట్టణంతో పాటు కురబలకోట మండలంలోని విద్యాసంస్థల్లో పరీక్షలను నిర్వహించడం జరిగింది. ఈ పరీక్షల కోసం 20కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 10గంటల నుంచి మద్యాహ్నం 1గంట వరకు పరీక్షలు జరిగాయి. అభ్యర్థులు ఉదయం 9గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకొని హాల్‌టికెట్లను సరిచూసుకొన్నారు. అనంతరం కేంద్రాల్లోకి వెళ్ళారు. మొత్తం 275మంది పోలీస్ బందోబస్తు నిర్వహించారు. పరీక్ష కేంద్రాల వద్ద అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి అనుమతించారు. జిల్లా ఎస్‌పి హర్షవర్ధన్ రాజు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మదనపల్లె డిఎస్‌పి కేశప్ప ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఎక్కడా ఎలాంటి ఘటనలు, మాస్ కాఫియింగ్ జరగకుండా గట్టి భద్రతా చర్యలు తీసుకున్నారు. ఒక నిమిషం ఆలస్యంగా వచ్చినా వారిని లోపలికి అనుమతించలేదు. సిఐలు మురళీక్రిష్ణ, సత్యనారాయణ, శివాంజనేయులు, సాధిక్‌అలీ, ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, సిబ్బంది పరీక్షా కేంద్రాల వద్ద విదులు నిర్వహించారు.

# రచయితలకు గ్రంథా అధ్యాయనం తప్పనిసరి

**నవలా రచయిత టిఎన్.క్రిష్ణమూర్తి**

మదనపల్లె, జనవరి 22 ప్రభాతవార్త :



సాహితీరంగంలో నూతనంగా ప్రవేశించే వారికి గ్రంథా అథ్యాయనం తప్పనిసరి అని నవలా రచయిత టిఎన్.క్రిష్ణమూర్తి తెలిపారు. పట్టణంలోని ప్రశాంతనగర్ జ్ఞానోదయ హైస్కూల్‌లో రచయితలు రచించి గ్రంథ ముద్రణ గావించిన "తనేగాప్రాణం" రచనా కవిత సంపుటి గ్రంథావిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన రచయితలు తెలుసుకోవాల్సిన విషయాలను క్షుణ్ణంగా వివరించారు. కథా రచయిత విమర్శకులు వేంపల్లి అబ్దుల్‌ఖాదర్ గ్రంథ సమీక్ష కావిస్తూ గ్రంథంలోని చమత్కారాలను, ప్రేమాభివేషాన్ని జాగ్రత్తలు వివరించారు. అనంతరం జ్ఞానోదయస్కూల్ కరస్పాండెంట్ కామకోటి ప్రసాద్‌రావు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో నూతన రచయితలు ముందుకు వస్తున్నారని అన్నారు. మరో అతిథి జోళిపాలెం భవానిప్రసాద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మునిగోపాల్ క్రిష్ణ, శకుంతలమ్మ, లయన్స్‌క్లబ్ అధ్యక్షులు అప్పినిపల్లె భాస్కరాచారి, శ్రీధర్, రామప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# 25న కలెక్టర్ కార్యాలయం వద్ద దీక్ష

**ఏఐటియుసి నాయకులు**

మదనపల్లె, జనవరి 22 ప్రభాతవార్త :

విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీ కరణకు వ్యతిరేకంగా ఈనెల 25న అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద దీక్షా కార్యక్రమం చేపడుతున్నట్లు ఏఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి సురేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఏఐటియుసి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగసంస్థలను కాపాడుదాం, విశాఖ ఉక్కును పరిరక్షిద్దామంటూ తెలిపారు. కేంద్రంలో బిజెపి రెండవసారి అధికారంలోకి వచ్చినా ప్రభుత్వ రంగసంస్థలన్నింటిని ప్రైవేటీ కరణ విధానాలకు పాల్పడుతున్నాదన్నారు. దీక్షా కార్యక్రమానికి సిపిఐ,ఏఐటియుసి ఆధ్వర్యంలో జరిగే మున్సిపల్ వర్కర్స్‌యూనియన్ మద్దతు ఇస్తున్నామన్నారు. ప్రజాసంఘాలు మద్దతు ఇవ్వాలని కోరారు.

# వైసిపి నాయకులచే 6టీవి క్యాలెండర్ ఆవిష్కరణ

రామసముద్రం, జనవరి 22 ప్రభాతవార్త :



రామసముద్రం మండలంలోని స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో వైసిపి సింగిల్‌విండో అధ్యక్షులు కేశవరెడ్డిచే ఆదివారం 6టివి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారదిలా ప్రజాసమస్యలే పరమాదిగా పనిచేసేది జర్నలిస్టులే అన్నారు. అక్షరాన్ని ఆయుదంగా మలచి సమాజంలో సేవలందిస్తున్న పాత్ర చాలా గొప్పదన్నారు. అనంతరం క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉదయ్‌శంకర్‌రెడ్డి, గెవెన్న, రాధాక్రిష్ణ, డాక్టర్‌ప్రకాష్, మైనార్టీ నాయకులు సిరాజ్ బాషా, మహబూబ్‌బాషా, అన్సర్‌బాషా, శ్రీనివాసులు, వల్లాల వేణుగోపాల్‌రాజు, హరినాథ్, పుంగనూరు సతీష్, మదనపల్లె చంద్రా, సోము, సుధాకర్, ఎంఆర్‌పిఎస్ నాయకులు కొండప్ప, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొండెక్కిన కూరగాయల ధరలు

**రూ.500 తీసుకెళ్ళితే సంచి నిండా రావే**

రామసముద్రం, జనవరి 22 ప్రభాతవార్త :



ఏ కూరగాయలు కొనాలన్నా ధరలు ఆకాశానంటుతున్నాయి. సామాన్య ప్రజలు కూరగాయలు కొనలేమంటూ బిక్కమొకాలువేస్తున్నారు. ఏ కూరగాయ తీసుకొన్నా కేజి రూ.50ల పైమాటే. గత 30రోజులుగా కూరగాయల ధరలు కొండెక్కి కూర్చున్నాయి. కూరగాయల పంటలను అరకొరకగా సాగు చేయడం వల్లే ధరలు భారీగా పెరిగాయని ఇటు రైతులు, అటు వ్యాపారస్తులు చెబుతున్నారు. టమోటాకు కూడా ధరలు వచ్చాయి. మార్కెట్‌లో కూరగాయల ధరల వివరాలు ఇలా ఉన్నాయి. టమోటా కిలో రూ.40నుంచి 50వరకు విక్రయించారు. అదే విదంగా మిరప రూ.50నుంచి 60వరకు, మునగ రూ.60నుంచి 80 వరకు, కాకర రూ.35నుంచి 45వరకు, బీరకాయ రూ.30నుంచి 40, వంకాయలు రూ.30నుంచి 40, బెండకాయ రూ.35నుంచి45, ముల్లంగి రూ.25, బీన్స్ రూ.35, క్యారెట్ రూ.40, బీట్‌రూట్ రూ.45, చిన్నఎర్రగడ్డలు రూ.45, కొత్తిమీర కట్ట రూ 10నుంచి 25,ఎర్రగడ్డలు కిలో రూ.35నుంచి40, ఉల్లగడ్డలు రూ.30నుంచి 40, తెల్లగడ్డలు రూ.60నుంచి 80, అల్లం రూ.80నుంచి 100 ధరలు పలికాయి. ఇక ఆకుకూరలు ఏ కట్ట కొనుగోలు చేయాలన్నా రూ.10కి పైమాటే పలుకుతోంది. సామాన్య ప్రజలు కొనుగోలు చేయలేని విధంగా మారింది. సాధారణంగా కిలో రూ.10నుంచి 20లు పలికే కూరగాయల ధరలు రూ.50ల పైమాటగా పలుకుతుండడంతో ప్రజలందరికి కూరగాయలు అల్లంత దూరాన ఉంటున్నాయి. వారపుసంతలో కూరగాయలు కొనుగోలు చేసేందుకు ప్రజలు వెనుకంజు వేస్తున్నారు. కొనలేం...తినలేమంటూ ప్రజలు ఆవేదన చెందుతున్నారు. పంట దిగుబడి తగ్గడంతో కూరగాయల ధరలు అధికంగా పెరిగాయని పలువురు చెబుతున్నారు. కూరగాయలు అధిక ధరలు ఉండడంతో పలువురు కొనుగోలు చేసేందుకు భయపడాల్సి వస్తోంది.

# పడకేసిన రైల్వే ప్రగతి

**సాయిలోకేష్ ఆరోపణ**

కురబలకోట, జనవరి 22 ప్రభాతవార్త :



ఈ ప్రాంత పాలకుల నిర్లక్ష్యం వల్ల కడప-బెంగుళూరు రైల్వేలైన్, ధర్మవరం, పాకాల డబుల్‌లైన్ అభివృద్ధికి నోచుకోలేదని బిజెపి రాష్ట్ర రాజకీయ సలహ కమిటీ సభ్యులు సాయిలోకేష్ అరోపించారు. ఆదివారం కురబలకోట మండలం అంగళ్ళులోని సాయిక్యాంపు కార్యాలయంలో స్థానిక విలేకర్లతో మాట్లాడారు. కడప బెంగుళూరు రైల్వేలైన్‌కు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రాకపోవడంతో ఆగిపోయింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన సొంత నియోజకవర్గం మీదుగా మళ్ళించాలన్న ప్రతిపాదనతోనే ఆగిపోయింది. ధర్మవరం-పాకాల రైల్వేలైన్ డబుల్‌లైన్‌గా మార్పు జరగనందున పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ళు నడవలేదన్నారు. కురబలకోటలో రిజర్వేషన్ కౌంటర్లు, ఎక్స్‌ప్రెస్‌రైలు, తుమ్మనగుంటలో ప్యాసింజర్లు స్టాపింగ్ చేసేందుకు కృషిచేస్తానని తెలిపారు. కదిరి-తిరుపతి ఇంటర్‌సిటి రైలు నడిపేందుకు కృషి చేస్తానని తెలిపారు. అంగళ్ళు, మదనపల్లె మార్గంలో విశ్వం కళాశాల మీదుగా బెంగుళూరు రూట్‌లోకి చిప్పిలి వరకు డబుల్‌లైన్ రోడ్డుకు కృషి చేస్తానని తెలిపారు. సిటిఎం అంగళ్ళు డబుల్‌లైన్‌గా మార్చితే తిరుపతి వెళ్ళే ప్రయాణీకులకు ప్రయాణదూరం తగ్గుతుందన్నారు. మదనపల్లె ప్రాంతంలో ఐటిహాబ్‌ను ఏర్పాటు చేస్తే ఇంజనీరింగ్ అభ్యసించిన నిరుద్యోగ యువతికి పొరుగురాష్ట్రాలు బెంగుళూరు, చెన్నై, తెలంగాణలకు ఉద్యోగాల కోసం వెళ్ళాల్సిన అవసరం ఉండదన్నారు. అదే విధంగా సిల్క్ డెవలెప్‌మెంటు చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం అభివృద్ది చెందడమే కాకుండా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. టమోటాసాగుతో రైతులు అధికంగా నష్టపోతున్నారని పట్టుపరిశ్రమ వైపు రైతులు మొగ్గుచూపేలా కేంద్ర సిరికల్చర్ అధికారులతో సంప్రదించి అవగాహన సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి శని, ఆదివారాల్లో అంగళ్ళులోని సాయిక్యాంపు కార్యాలయంలో నాలుగు నియోజకవర్గాలకు చెందిన తంబళ్ళపల్లె, పుంగనూరు, పీలేరు, మదనపల్లెకు చెందిన ప్రజలు సమస్యలపై అర్జీలు స్వీకరిస్తానన్నారు.

# కురబలకోటలో రెండవరోజు పలకరింపు యాత్ర

కురబలకోట, జనవరి 22 ప్రభాతవార్త:




మండల కేంద్రమైన కురబలకోటలో రెండవ రోజు చల్లపల్లె నరసింహారెడ్డి పలకరింపు యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా ఆయన తిరిగి వారిని ఆప్యాయతంగా పలకరిస్తూ కుటుంబసభ్యులను మాట్లాడుతూ సమస్యలను తెలుసుకొంటూ తిరిగారు. స్వచ్ఛందంగా ప్రజలు ఎక్కడనుంచో వచ్చిన వారికి అవకాశం ఇచ్చాం. ఈసారి పార్టీలకు అతీతంగా మిమ్మలను ఒక్కసారి చూడాలని కోరుతున్నామని ప్రజలు ఆయనకు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మీ ఆశలను ఒమ్ము చేయకుండా సమస్యలు పరిష్కరించి ఎల్లవేలలా మీ వెంట నేను ఉంటానని భరోసా ఇచ్చారు. కురబలకోట కస్పాలోని తేరువీధి, కొత్త మసీదు, బస్టాండు వీధి, అప్పాగారివీధి, మర్రిమానువీధి, వైశ్యబజారు, బ్రాహ్మణవీధుల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన వెంట బావాజన్, ఫరీద్‌ఖాన్, ప్రసన్నకుమార్, కాకర్ల విశ్వనాథ్, క్రిష్ణారెడ్డి, మణికంఠరెడ్డి, తుమ్మచెట్లపల్లె శీన, ఈశ్వర్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, దివాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సిరులు కురిపిస్తున్న బొప్పాయి

**ఆనందపడుతున్న బొప్పాయిరైతన్న**

రామసముద్రం, జనవరి 22 ప్రభాతవార్త :



బొప్పాయి సాగు రైతుల ఇంట సిరులు కురిపిస్తున్నాయి. సాగుకు ఖర్చు తక్కువ, పంట ఎక్కువ లాభాలు వస్తుండడంతో రైతులు బొప్పాయి పంట సాగుపై ఆసక్తి కనపరుస్తున్నారు. గతంలో సీజన్‌లో మాత్రం రైతులు పంట సాగు చేపట్టేవారు. కానీ ఇప్పుడు పట్టణాల్లో, నగరాల్లో బొప్పాయికి అధికంగా డిమాండ్ ఉండడంతో అన్ని కాలాల్లో ఈ బొప్పాయి పంటను సాగు చేస్తున్నారు. రామసముద్రం మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లోని పలు పంట పొలాల్లో బొప్పాయి సాగు ఈ ఏడాది ఎక్కువ విస్తీరణంలో సాగు చేపట్టారు. ఎకరం పొలానికి రూ.70వేలు ఖర్చు అవుతుంది. సంవత్సరానికి రెండు, మూడు సార్లు ఎరువులు, సేంద్రీయ ఎరువులతో పాటు ఆముదం పిండి, యూరియా, పోటాషియం వంటివి కూడా వేస్తారు. వీటికి సుమారు ఎకరాకు రూ.20 వేలు ఖర్చు అవుతుంది. మొక్కలకు మందులు కలుపుకొని కొట్టడానికి కూలీలు, ఇతర ఖర్చులు కలిపి మరో రూ.25వేలు అదనంగా చివరకు పంటకు చేతికి అందేవరకు ఎకరాకు రూ.75వేలు ఖర్చు అవుతున్నట్లు గ్రామీణులు తెలిపారు. దిగుబడి బాగా వస్తే సుమారు అటో ఇటోగా 25టన్నుల కాయలు కొతకు వస్తాయి. సంవత్సరానికి 250టన్నులు మంచి దిగుబడులు అందుతాయని తెలిపారు. ప్రస్తుత టన్ను రూ.10వేలు ప్రకారం చూస్తే సంవత్సరం మొత్తం మీద రూ.2.50లక్షలు ఆదాయం వస్తుందన్నారు. ఖర్చులు పోనూ రూ.1.50లక్షలు ఆదాయం మిగులుతుందని రైతులు చెబుతున్నారు. బొప్పాయి డిమాండ్‌ను బట్టి బండ్లపై, సైకిళ్ళపై, తట్టిల్లో బుట్టల్లో సాయంత్రం, ఉదయం అన్న తేడా లేకుండా ప్యాకింగ్ చేసుకొని గ్రామాల్లోని పొలాల వద్ద అమ్మకాలు జరుపుతున్నారు. ఈ పంట వేసిన రైతులు కూడా లాభాల బాటలో పయనిస్తున్నారు.

# లోకేష్ పాదయాత్ర పోస్టర్ విడుదల

పీలేరు, కలికిరి, జనవరి 22 ప్రబాతవార్తః



కలికిరి మండల పరిధిలో ధరణిహోటల్ సమీపంలో తెదేపా నాయకులతో పాటు రాష్ట్రముస్లీం మైనారిటీ నాయకుడు హనీఫ్, ఎస్టీ నాయకులు వర్మ, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధక్షులు అగస్తీశ్వర్, అడ్వకేట్ రాంప్రసాద్‌రెడ్డి, పులి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో లోకేష్ పాదయాత్ర పోస్టర్‌ను విడుదల చేసినట్లు వారు ఓ ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పుడే రాష్ట్రంలో తెదేపాకు అత్యధిక ప్రజల అండదండలతో పాటు పార్టీ పునర్వైభవంగ పుంజుకుంటున్న నేపథ్యంలో వైసీపీ ఆగడాలను తెలుసుకుని అరికట్టేందుకు తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోకేష్ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించేందుకు ముమ్మరంగా సన్నాహాలు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోఉన్న తెదేపా అన్ని విభాగాల సంఘాలతో పాటు నాయకులు, కార్యకర్తలు లోకేష్ పాదయాత్రను విజయవంతం చేయాలని వారు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యారెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి, యర్రమరెడ్డి ,మధురెడ్డి, సహదేవరెడ్డి, మల్‌రెడ్డి, జనార్ధన్ గౌడ్, వర్మ, అగస్తీ , అఫ్రోజ్, వలి, జావీద్, జాకీర్, సుభహాన్, మహమ్మద్, ఎస్ఎంబీ మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

# శిధిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగింపు

పీలేరు,జనవరి 22 ప్రభాతవార్తః



పీలేరు పట్టణంలో స్థానిక పద్మావతీ నగర్‌లో శిధిలావస్థలో ఉన్న విద్యుత్ స్తం భాలను తొలగించినట్లు సర్పంచి డాక్టర్ హబీబ్‌బాషా తెలిపారు. ఆదివారం స్థానిక పద్మావతీనగర్‌లో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు మేరకు ట్రాన్సుకో అధికారులతో కలిసి విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పరిచి ఇళ్లపై ఉన్న విద్యుత్ తీగలను తొలగించినట్లు ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో ట్రాన్సుకో ఏఈ పురుషోత్తం, ఈఓ రెడ్డిప్రసాద్‌రెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవికుమార్, నాయకులు శ్రీరామసుధాకర్, సచిన్, విక్టరీ, రియాజ్, తదితరులు పాల్గొన్నారు.

# మైనరు బాలిక సంఘటనపై సమగ్రంగా నివేదిక అందిస్తాం

వాల్మీకిపురం,జనవరి 22 ప్రభాతవార్తః



స్థానిక గురుకుల పాఠశాలలో ఇటీవల జరిగిన మైనరుబాలిక ప్రసవం సంఘటనపై ప్రభుత్వానికి సమగ్రంగా నివేదిక అందిస్తామని గురుకుల పాఠశాల జిల్లా సమన్వయ అధికారి డీసీఓ వెంకట్రావు అన్నారు. ఆదివారం గురుకుల పాఠశాలను సందర్శించి డీసీఓ రికార్డులు పరిశీలించి అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు , పాఠశాల సిబ్బందిని విడివిడిగా విచారించారు. అనంతరం విజయవాడకు చెందిన హెల్త్ మానిటరింగ్ అధికారి డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ పాఠశాల సిబ్బంది, వైద్య సిబ్బంది సైతం అమ్మాయిన బాలిక అన్న కోనంలో చూడడం జరిగిందని మైనరు బాలిక కావడం నిత్యం తోటి పిల్లలతో ఆడుకోవడంతో పాటు విద్యార్థిని ఆరోగ్యంగా ఉండటంతో సకాలంలో సిబ్బంది గుర్తించలేకపోయారన్నారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏచిన్న సమస్య ఉన్నా సకాలంలో పాఠశాల యాజమాన్యంతో పాటు సిబ్బందికి తల్లిదండ్రులకు తక్షణమే తెలియజేయాలని వక్తలు సూచించారు. అనంతరం మైనరు బాలికను మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించి ఆరోగ్యంగా ఉన్న తల్లి బిడ్డను ఉన్నతాధికారులు వారి తల్లిదండ్రులకు అప్పగించారు. అయితే ఇలాంటి సంఘటన పాఠశాల యాజమాన్యం అక్కడ పనిచేస్తున్న వైద్య సిబ్బంది సైతం ముందస్తుగా విషయాన్ని గుర్తించకుండా ఈసంఘటనపై నిర్లక్ష్యం వహించారని విద్యార్థులు తల్లిదండ్రులు ఆరోపించారు.

# మాలలంతా ఐక్యం కావాల్సిన సమయం ఆసన్నమైంది

వాల్మీకిపురం, జనవరి 22 ప్రభాతవార్తః

రాష్ట్రంలోని మాలలంతా ఐక్యం కావాల్సిన సమయం ఆసన్నమైందని మాల మహానాడు రాష్ట్ర అద ్యక్షులు యామల సు దర్శనం పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిదిగహంలో ఏర్పాటుచేసిన జిల్లా స్థాయి మాలమహానాడు సమావేశానికి ఆసంఘం జిల్లా అధ్యక్షులు శివయ్య ఆద్వర్యంలో నిర్వహించారు. అనంతరం ముఖ్య అతిధిగా హాజరైన యామల సుదర్శనం మాట్లాడుతూ త్వరలోనే మాలమహానాడు జిల్లా మండల స్థాయి కమిటీలను త్వరలో వేస్తామన్నారు. తద్వార మాలల్లో మరింత ఐక్యత తీసుకువచ్చి మాలమహానాడును బలమైన వ్యవస్థగా తీర్చిదిద్దుతామన్నారు. అనంతరం గ్రామంలో మాలలు పడుతున్న సమస్యలపై వారు చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సంజీవ, రాష్ట్ర అధికార ప్రతినిధి వీరభద్రయ్య, రాయలసీమ జోనల్ కార్యదర్శి చంద్రయ్య, నాయకులు, మోహన్, సుధాకర్, రఘు, కిరణ్, చిరంజీవి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాద రహిత సమాజాన్ని నిర్మిద్దాం

పీలేరు, జనవరి 22 ప్రభాతవార్తః

సమిష్టి కషితో ప్రమాద రహిత సమాజాన్ని నిర్మిద్దామని పీలేరు, వాల్మీకిపురం సీఐలు మోహన్‌రెడ్డి, సురేష్‌లు అన్నారు. ఆదివారం స్థానిక ఎంవిఐ కార్యాలయంలో 34వ రహదారి భద్రత వారోత్సవాలలో భాగంగా ఆటో, ట్యాక్సీ, ఆర్టీసీ, ప్రయివేటు డ్రైవర్లుకు ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 2022లో 727 ప్రమాదాలు జరిగి 346 మంది చనిపోయారని అందులో కేవలం ద్విచక్ర వాహనాలు ద్వారా 206 ప్రమాదాలు జరిగితే 188 మంది మతిచెందడం జరిగిందని తెలిపారు. ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, మానవ తప్పిదాల వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదాలకు కారణం అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. విధులకు హాజరయ్యే డ్రైవరు మానసిక ప్రశాంతత, ఏకాగ్రతతో వెళ్లాలని సూచించారు. డ్రైవర్లు విధిగా లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం బండ్లకుమార్, గ్యారేజీఎంఎఫ్ హరినాధరెడ్డి, ఎంవీఐ విజయకుమారి, పాల్గొన్నారు.

# ప్రమాద రహిత సమాజాన్ని నిర్మిద్దాం

పీలేరు, జనవరి 22 ప్రభాతవార్తః

సమిష్టి కషితో ప్రమాద రహిత సమాజాన్ని నిర్మిద్దామని పీలేరు, వాల్మీకిపురం సీఐలు మోహన్‌రెడ్డి, సురేష్‌లు అన్నారు. ఆదివారం స్థానిక ఎంవిఐ కార్యాలయంలో 34వ రహదారి భద్రత వారోత్సవాలలో భాగంగా ఆటో, ట్యాక్సీ, ఆర్టీసీ, ప్రయివేటు డ్రైవర్లు,కు ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 2022లో 727 ప్రమాదాలు జరిగి 346 మంది చనిపోయారని అందులో కేవలం ద్విచక్ర వాహనాలు ద్వారా 206 ప్రమాదాలు జరిగితే 188 మంది మతిచెందడం జరిగిందని తెలిపారు. ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, మానవ తప్పిదాల వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదాలకు కారణం అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. విధులకు హాజరయ్యే డ్రైవరు మానసిక ప్రశాంతత, ఏకాగ్రతతో వెళ్లాలని సూచించారు. డ్రైవర్లు విధిగా లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం బండ్లకుమార్, గ్యారేజీఎంఎఫ్ హరినాధరెడ్డి, ఎంవీఐ విజయకుమారి పాల్గొన్నారు.

# కలకడ సమీపంలో చెట్టును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

పీలేరు, కలకడ, జనవరి 22 ప్రభాతవార్తః



తిరుపతి నుంచి రాయచోటికి వెళుతున్న ఆర్టీసీ బస్సు కలకడ సమీపంలో చెట్టును ఢీకొన్న సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఈసంఘటనలో డ్రైవరు,కండెక్టరుతో సహా 8 మందికి గాయాలు అయ్యాయి. గాయపడినవారిని స్థానికులు అంబులెన్సు ద్వారా పీలేరు, రాయచోటి ప్రభుత్వాసుపత్రికి 108లో తరలించారు. ఈ ప్రమాదంలో కండెక్టరుకు రెండు కాళ్ల విరగడంతో ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు. కండెక్టరు వెనుక ఉన్న సీటులో ఉన్న మహిళకు తీవ్రగాయాలు అయ్యాయి. ఆసుపత్రిలో వైద్యం పొందుతున్నవారిని ఆర్టీసీ డీఎం ధనుంజయ పరామర్శించి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. డ్రైవర్ లోబీపీతో కళ్లు తిరగడంతో ఈప్రమాదం జరిగినట్లు వైద్యులు, అధికారులు తెలిపారు.

# ఘనంగా సప్పాలమ్మకు బోనాలు

చిన్నమండెం.జనవరి22 ప్రభాతవార్త



మండలంలోని మల్లూరు గ్రామం కొత్తపేటలో నూరు కుటుంబాలు సప్పలమ్మ అమ్మవారికి ఆదివారం ఘనంగా బోనాలు పెట్టి మొక్కుకున్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున మేళ తాళాలతో, బాణా సంచా పేలుళ్లతో ప్రజలు ప్రతి ఇంటికి కోడి పుంజుతో గ్రామ సమీపంలోని ఆలయానికి చేరుకుని బోనాలు నైవేద్యంగా పెట్టి కోళ్లను, గొర్రెలను బలిచ్చారు.బంధుమిత్రులతో కలిసి బోనాలు పండుగను జరుపుకున్నారు.

# కార్యకర్తను పరామర్శించిన ఎమ్మెల్యే

రామాపురం.జనవరి22 ప్రభాతవార్త



రామాపురం మండలం కుమ్మరపల్లికి చెందిన వైఎస్సార్‌సిపి కార్యకర్త తాతిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి కాలుకు శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి పొందుతున్నారు. ఆదివారం చంద్రశేఖర్‌రెడ్డిని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు.

# పేదల భూములు చూపించాలి

**- వ్య.కా.స. జిల్లా అధ్యక్షుడు శివ కుమార్**

బ్రహ్మంగారి మఠం, జనవరి 22 ప్రభాతవార్త :



మండలంలోని అసైన్‌మెంట్ లబ్ధిదారులకు సర్వే చేసి భూములను చూపించడంలో ప్రభుత్వం, అధికారులు పూర్తిగా విఫలమయ్యారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శివ కుమార్ విమర్శించారు. ఈ సందర ్భంగా వారు మాట్లాడుతూ 2006, 2007 సంవత్సరాల కాలంలో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి భూ పంపిణీలో భాగంగా మండలంలోని అర్హులైన పేదలకు అసైన్‌మెంట్ ద్వారా దాదాపు 2500 ఎకరాలు భూ పంపిణీ చేశారని, నేటికి 15 సంవత్సరాలు గడిచినా ఇంకా దాదాపు 1200 ఎకరాల భూమిని లబ్ధిదారులకు సర్వే చేసి చూపించడం లేదని వారు ఆరోపించారు. సోమిరెడ్డిపల్లె, నరసన్నపల్లె, మదిరెడ్డిపల్లె, పాపిరెడ్డిపల్లె, కొండువారిపల్లె, పలుగురాళ్ళపల్లె, కొత్తపల్లె, బాకరాపేట, రవీంద్ర నగర్, తోట్లపల్లె తదితర గ్రామాల ప్రజలు సంవత్సరాల తరబడి రెవిన్యూ, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఉపయోగం లేకుండా పోతోందని వారు దుయ్యబట్టారు. ఎమ్మెల్యే రఘురామిరెడ్డి దృష్టికి పలుమార్లు తీసుకువెళ్ళడం జరిగిందని, సమస్యను పరిష్కరిస్తామని హామీ తప్ప పరిష్కారం కాలేదని వారన్నారు. ఇదే అదునుగా తీసుకొని కొంత మంది పలుకుబడి కలిగిన వారు భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారని వారు పేర్కొన్నారు. పేదలు కూడా తమకు భూములు వచ్చాయన్న సంగతి మరిచిపోతున్నారని వారు ఎద్దేవా చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం అసైన్‌మెంట్ కమిటీ సమావేశాలు నిర్వహించే ఆలోచనలు చేస్తుందని, ఈ లోపే గత లబ్ధిదారులకు భూములను సర్వే చేసి చూపించాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో లబ్ధిదారులతో కలిసి ఆందోళనకు సిద్ధమవుతామని వారు తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు గోవిందు, మండల నాయకులు రమణయ్య, భాస్కర్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# వడ్డెర సంఘం నూతన అధ్యక్షుడిగా సంటెన్న

వేంపల్లె, జనవరి 22, ప్రభాతవార్త :



వడ్డెర సంఘం నూతన అధ్యక్షుడిగా ఎం.సంటెన్నను ఎన్నుకున్నారు. వేంపల్లెలోని ఎంఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం వడ్డెర సంఘం నూతన అధ్యక్షుని ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఇందులో భాగంగా అధ్యక్షుడిగా సంటెన్న, ఉపాధ్యక్షులుగా మల్లె గంగరాజు, బత్తల ఆదినారాయణను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా వల్లెపు రాజు, వల్లెపు రమణ, రాచవేటి తేజ, బత్తల గంగాధర, బత్తల మోహన్ ప్రధాన కార్యదర్శి గోగుల ఎర్రకొండయ్య, కార్యదర్శిగా దేరంగుల శ్రీను, గౌరవ సలహాదారులుగా వల్లెపు సుబ్బయ్య, ఇ.బాలరాజు కె.మునిరాజు, సంయుక్త కార్యదర్శిగా వల్లెపు రత్తయ్య, తదితరులను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన సభ్యులు ప్రమాణం చేశారు.

# విశాఖ ఉక్కు ప్రవేటీకరణను వ్యతిరేకిద్దాం

గాలివీడు.జనవరి22 ప్రభాతవార్త



విశాఖ ఉక్కు ప్రభుత్వ ఆదీనంలోనే ఉండాలని సిపిఐ రాయచోటి నియోజకవర్గం సహాయ కార్యదర్శి జక్కుల వెంకటేష్ అన్నారు. ఆదివారం సిపిఐ మండల కమిటి సమావేశం మండల కార్యదర్శి నచ్చు భాస్కర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1964లో విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా ఉద్యమాలు నిర్వహించి దాదాపు 32 మంది ప్రాణాలర్పించి సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్పోరేట్ ప్రవేట్ వ్యక్తులకు ప్రభుత్వ రంగ స ంస్థలను చైకబారుగా కట్టబెట్టే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని రాష్ట్ర కమిటి పిలుపుమేరకు సిపిఐ ఏఐటియుసి ఆద్వర్యంలో ఈనెల 25న అన్ని జిల్లాల కలెక్టరేట్‌ల వద్ద జరిగే నిరసన సభను జయప్రదం చేయాలని కార్యకర్తలుకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ మండల సహాయకార్యదర్శి కృష్ణమూర్తి, దీపక్, మనోహర్, రెడ్డెప్ప, ఏఐటియుసి నాయకురాలు కృష్ణవేణి, శశికళ, బీబిజాన్ తదితరులు పాల్గొన్నారు.

# వాలంటీర్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోండి

చిన్నమండెం.జనవరి22 ప్రభాతవార్త

మండలంలోని కేశాపురం గ్రామంలో ఖాళీగా ఉన్న వాలంటీర్ ఉద్యోగానికి గ్రామానికి చెందిన బీసి జనరల్ అభ్యర్థి దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడివో దివ్య తెలిపారు. ఈ నెల 25వ తేదీ లోపల 10వ తరగతి పాసైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి. 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు ఉండాలి. దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 27 నుంచి 29 వరకు ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు. కావునా ఈ అవకాశాన్ని అర్హత ఉన్న అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# నవోదయ పరీక్షలకు దరఖాస్తు చేసుకోండి

**- ఎంఈవో త్యాగరాజు**

తంబళ్లపల్లె, జనవరి 22, ప్రభాతవార్త:



తంబళ్లపల్లె మండలంలోని 3, 4 తరగతి చదివి పాసైన అభ్యర్థులు నవోదయ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో త్యాగరాజు పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు గుర్తింపు పొందిన పాఠశాలలోని 3, 4 తరగతుల్లో పాసై ఐదవ తరగతి చదువుతూ ఉండి 30.4. 2013ల మధ్య జన్మించిన విద్యార్థులు అర్హులన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ పిల్లలకు రిజర్వేషన్లతో పాటు మారుమూల ప్రాంతాల విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుందని ఈ అవకాశాన్ని ఈనెల 31 లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

**-జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి**

రాయచోటి టౌన్.జనవరి22 ప్రభాతవార్త



జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు తెలియజేస్తే వాటిని వెంటనే పరిష్కరించడానికి తాను కృషి చేస్తానని అన్నమయ్య జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు యర్రపురెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమస్యలను సానుకూలంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి తను అన్ని విధాల ప్రయత్నం చేస్తానని చెప్పారు. సమావేశానికి హాజరయిన ఉద్యోగులందరికి 2023 డైరీని అందజేయడం జరిగింది. ఉద్యోగులందరూ సభ్యత్వమును వెంటనే పూర్తి చేయాలని ఆయన కోరారు. అలాగే రాష్ట్ర సంఘం పైన వస్తున్న ఆరోపణలను కూడా ప్రకటనలను ద్వారా తిప్పికొట్టాలన్నారు. సమావేశంలో కార్యదర్శి గురుప్రసాద్ కోశాధికారి సుధాకర్‌రాజు, ఉపాధ్యక్షులు రెడ్డినాయక్, శివరాంరెడ్డి, కృష్ణవేణి, రాయచోటి తాలూకా అధ్యక్షులు సాయికుమార్, కార్యదర్శి సుజిత్, కోశాధికారి సురేష్‌బాబు, అలాగే రాయచోటి, లక్కిరెడ్డిపల్లి తాలూకాలోని ఉద్యోగులు పాల్గొన్నారు.

## రూట డైరీని ఆవిష్కరించిన ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా

**కడప ఏడురోడ్లు, జనవరి 22, ప్రభాతవార్త:**



రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) డైరీని ఉప ముఖ్యమంత్రి మరియు మైనార్టీ సంక్షేమ శాఖామంత్రి అంజాద్‌బాషా, రూట డైరీ కమిటీ ఛైర్మన్ హాజీ అబ్దుల్ హకీంసాహెబ్, రూట వ్యవస్థాపకులు సయ్యద్ హిదయతుల్లా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా మాట్లాడుతూ రూట సంఘం గత మూడు దశాబ్ధాలుగా రాష్ట్రంలో ఉర్దూ మీడియం విద్యా సంస్థల పరిరక్షణకు, అభివృద్ధికి కృషి చేస్తుండడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్ మాట్లాడుతూ ఉర్దూ పాఠశాలల నుంచి ఉర్దూ విశ్వ విద్యాలయాల వరకు ఉపాధ్యాయ అధ్యాపక విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వం ఉర్దూ విద్యా సంస్థల మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో రూట రాష్ట్ర నాయకులు డా.వసీఉల్లాసాహెబ్, సత్తార్‌ఫైజీ, సయ్యద్ సిరాజుద్దీన్, మహ్మద్ అయూబ్, అఫ్జల్‌బాషా, ఫకృద్దీన్, జిల్లాఅధ్యక్షులు మహ్మద్‌ఇర్షాద్ తదితరులు పాల్గొన్నారు.

## దొమ్మర నంద్యాలలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం

**జమ్మలమడుగు, జనవరి 22, ప్రభాతవార్త:**



మైలవరం మండలం దొమ్మర నంద్యాల గ్రామంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. జమ్మలమడుగు తెదేపా ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, కడప పార్లమెంటు అధ్యక్షులు లింగారెడ్డి, జమ్మలమడుగు నియోజకవర్గ పరిశీలకులు మద్దూరు రామకృష్ణలకు గ్రా నాయకులు, కార్యకర్తలు బాణా సంచా పేలుస్తూ వారికి పూలమాలలు వేసి శాలువా కప్పి ఘనంగా స్వాగతం పలికారు. మొదటగా వారంతా సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం యువకులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రతి ఇంటికి తిరిగి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి నన్ను ఎమ్మెల్యేగా, చంద్రబాబును సీఎంగా గెలిపించాలని కోరారు. ఎన్నికలు పూర్తయిన నాలుగు సంవత్సరాలు అవుతున్నా స్టీల్ ప్లాంట్ పూర్తి చేస్తామని చెప్పి నిరుద్యోగులను మోసం చేశారని ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. ఈ ప్రభుత్వాన్ని గద్దె దించాలని అప్పుడే ప్రజల కష్టాలు తీరుతాయని తెలిపారు. కార్యక్రమంలో జాంబపురం రమణారెడ్డి, తెదేపా నాయకులు, కార్యకర్తలు దేవగుడి కుటుంబ అభిమానులు, దొమ్మర నంద్యాల గ్రామ నాయకులు భూషిరెడ్డి, తులసిరెడ్డి, ఖాదర్, సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, పుల్లారెడ్డి ఖాదర్, రామయ్య, చైతన్య, దిలీప్, ప్రసాద్, గిరి, ప్రసాద్, నారాయణ, సయ్యద్, నబీ, హుసేన్ పీరా, సుధాకర్, నాగలక్ష్మి, నారాయణ, ఇమాం హుసేన్, రసూల్, విజయరాజు, నాగరాజు, ఒగ్గు శివ, ఎన్.ఇమాం హుసేన్, ఎన్.సల్తాన్, ఎస్.శేఖర్, గౌస్, నూర్, జింకా శంకర్, గౌస్‌పీర్, శివుడు, మంగలి లక్ష్మి నరసయ్య, నాయకులు కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## గంగమ్మ జాతర ఏర్పాట్లు పరిశీలించిన సీఐ వరప్రసాద్

**లక్కిరెడ్డిపల్లె, జనవరి 22, ప్రభాతవార్త:**



ఫిబ్రవరి నెల 22, 23 తేదీల్లో జరుగుతున్న గంగమ్మ జాతర ఏర్పాట్లు ఆదివారం సీఐ వరప్రసాద్ ఎస్సై వినోద్‌కుమార్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడాది పాటు చెల్లు వంశీయుల నుంచి ఆదిమూలం వంశీయులకు పూజారి అర్చన విధానాన్ని ఆదిమూలం వంశీయులకు అప్పగించారు. సందర్భంగా జాతరలో ఎలాంటి అవాంచనీయ సంఘటన జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసామని సీఐ తెలిపారు. జాతర ప్రాంగణం శుభ్రం చేయించి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. జాతరలో వాహనాలు పార్కింగ్, విద్యుత్తు సౌకర్యం, మంచినీటి సౌకర్యం, చలువ పందిళ్ల ఏర్పాట్లు పరిశీలించారు. ఈ ఏడాది భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారని ఆలయ సిబ్బంది అంచనాలు వేస్తున్నారు. ఏదిఏమైనా భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని ఈవో రవీంద్రరాజు, ఛైర్మన్ నరసింహారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వినోద్‌కుమార్, ఆలయ కమిటీ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

## మున్సిపల్ హైస్కూల్ విద్యార్థుల అపూర్వ కలయిక

**కడప వైద్యవిభాగం, జనవరి 22, ప్రభాతవార్త:**



1982-83 పదో తరగతి బ్యాచ్ విద్యార్థినీ విద్యార్థులు ఆదివారం చలమారెడ్డిపల్లెలోని ఎంఎస్ఆర్ మిల్ వ్యాలీలో 40 సంవత్సరాల అనంతరం మిత్రులంతా ఒక చోట చేరి గురువులను సత్కరించుకొని తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. 60 మంది విద్యార్థులు మరియు వారి కుటుంబ సభ్యులు మొత్తం 200 మంది ఈ వేడుకలో పాల్గొన్నారు. గురువులను దుశ్శాలువాలతో సత్కరించి పూలదండలు వేసి పూజించారు. గురువులకు కొత్త బట్టలు పెట్టారు. 40 సంవత్సరాల నాటి తమ చిన్ననాటి చిలిపి చేష్టలను అందరూ ఒక్కసారి గుర్తు చేసుకున్నారు. మళ్లీ 2028వ సంవత్సరం జనవరి 23వ తేదీన తిరిగి కలుద్దామని తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు నీలి శ్రీనివాసరావు, సత్యనారాయణ, నిత్య, రమణ, ఇస్మాయిల్ బాబు, వాసు, గణేష్, రెడ్డి భాస్కర్, శివశంకర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, భాస్కర్ గౌడ్, హర్షవర్ధన్‌రెడ్డి, శివాజీ, రాధా, కరుణ, ఖాదరయ్య, రవిశంకర్, బాలాజీ, రషీద్, కృష్ణారెడ్డి, డా.మల్లికార్జున, సాయిప్రసాద్, భాస్కర్, బాల మురళీ, కృష్ణ, చంద్రశేఖర్, రాజా, పుష్పరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత హోమియో వైద్య శిబిరానికి విశేష స్పందన

**వేంపల్లె, జనవరి 22, ప్రభాతవార్త :**



వేంపల్లెలో ఆదివారం ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ (అవోపా) ఆధ్వర్యంలో శ్రీవాస వి కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో కడపకు చెందిన ప్రముఖ వైద్యులు క్రిష్టిపాటి శేషఫణిచే ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో సుమారు 132మంది హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వీరికి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు క్యాంపు ఛైర్మన్ పోలేపల్లె సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో అవోపా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వెంకటరాం, వేంపల్లె అవోపా అధ్యక్షుడు గోవర్ధన్, సభ్యులు రాయవరం ద్వారక, దొంతు లక్ష్మిశెట్టి, దారా మధుకర్, వినయ్‌కుమార్, భరత్, మనోజ్, అరుణ్, సాయి, ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు బచ్చు సుబ్బారావు, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు గోనుగుంట్ల హరిక్రిష్ణ, అవోపా కార్యవర్గ సభ్యులు లీలావతి, తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమావేశం

**వేంపల్లె, జనవరి 22, ప్రభాతవార్త :**



వేంపల్లెలోని తలిశెట్టి సుబ్రహ్మణ్యం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1986-87 సంవత్సరం పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పూర్వ విద్యార్థి, నిర్వాహకుడు కేశవ ప్రతాప్‌రెడ్డి, నిచ్చెనమెట్ల క్రిష్ణ కిషోర్ ఆధ్వ్యంలో పూర్వ వద్యార్థులంతా ఇక్కడ చేరి అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆనాడు విద్యాబోధన చేసిన గురువులు పుల్లారెడ్డి, ఉషారాణి, వెంకటలక్షుమ్మ, వెంకట్రామిరెడ్డి, లక్ష్మినారాయణ, ఆదినారాయణలకు బట్టలు సమర్పించి సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారి హాజరయ్యారు. అనంతరం విద్యార్థులందరు చాలా ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మేడా శ్రీనివాసులు, అల్లాబకాష్, శ్రీకాంత్, సుబ్బారావు, శర్మ, మునీర్, సుభాన్, షేక్షావలి, శేషారెడ్డి, కటిక రాజా, సీఎస్ గౌస్ మొహిద్దిన్, తదితరులు పాల్గొన్నారు.

## పవర్ ప్రాజెక్ట్ నిర్మించడంతో మండల అభివృద్ధి

**-మాజీ ఎంపిపి విజయభాస్కర్‌రెడ్డి**

**వీరబల్లి.జనవరి22 ప్రభాతవార్త**



వీరబల్లి మండలానికి వాటర్ డ్రంపింగ్ పవర్ ప్రాజెక్ట్‌ను మండలంలో వంగిమళ్ల పంచాయతీలో నిర్మించడం మండల అభివృద్ధి జరుగుతుందని మండల మాజీ ఎంపిపి వైసిపి సీనియర్ నాయకులు విజయ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన తన నివాసంలో ప్రభాతవార్తతో మాట్లాడుతూ జిల్లాలో మారు మూల ప్రాంతమయిన వీరబల్లి మండలానికి పవర్ ప్రాజెక్ట్ ప్రభుత్వం మంజూరు చేయడం అదృష్టంగా భావించాలన్నారు. స్థానికంగా కొందరు నాయకులు అభివృద్దిని ఓర్వలేక రైతులను రెచ్చగొట్టి ప్రాజెక్ట్‌ను నిర్మాణాన్ని అడ్డుకోవడం మంచిదికాదన్నారు. కనీసం ప్రాజెక్ట్ గురించి అవగాహన లేనివారు మాట్లాడటం మంచిపద్దతికాదన్నారు. ప్రాజెక్ట్ వలన నష్టపోతున్న రైతులకు అనుకున్న రీతిలో నష్ట పరిహారం ఇప్పిస్తామని చెప్పారు. పట్టా భూమికి ఎంత డబ్బు వస్తే మిగితా భూములకు కూడా అంతే డబ్బు వస్తుందని తెలిపారు. అంతేకాకుండా మండట చుట్టు పక్కల గ్రామాల అభివృద్దితో పాటు మంచి రోడ్ల నిర్మించడం జరుగుతుందన్నారు. మాండవ్యనదిపై వంతెనలు నిర్మిస్తారు. రాజంపేట మండపం పల్లె వరకు గడికోట వరకు రోడ్డు నిర్మిస్తారు. ఈ ప్రాజెక్ట్ దేశంలోనే నాలుగవది. దాదాపు 900 కోట్ల రూపాయలతో ఈ ప్రాజెక్ట్ నిర్మిస్తారు. ఈ ప్రాజెక్ట్‌కు కవాలసిన నీరు అన్నమయ్య బ్యాక్ వాటర్‌ను తీసుకోవడం జరుగుతుంది. దీనిపై అపోహలు మానుకుని దీని వలన రైతులకు ఎటువంటి నష్టం జరగదన్నారు. మండల ప్రజలు, రైతులు నాయకులు అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ ప్రాజెక్ట్ మండలానికి ఒక వరంగా బావించాలని ఆయన పేర్కొన్నారు.

## జోరుగా వాహనాల తనిఖీ

**వీరబల్లి.జనవరి22 ప్రభాతవార్త**



మండలంలో ఉదయం, సాయంకాలం కలిపి స్థానిక ఎస్ఐ రహీముల్లా తనిఖీలు చేపట్టారు. ప్రభుత్వ ఆదేశాలమేరకు ఉన్నతాధికారుల సలహాల మేరకు తనిఖీలు చేపట్టినట్లు తెలిసింది. వాహనాలకు రికార్డులు లేకపోయినా నడిపే వ్యక్తులకు లైసెన్స్ లేకపోయినా వారికి జరిమానాలు వేశారు. అంతేకాక అటువంటి వారికి హెచ్చరించి కఠిన చర్యలు తప్పవని తెలిపారు. ప్రతి వాహనానికి ఇన్సూరెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. అదేవిధంగా హెల్మెట్, మాస్క్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మండల అద్యక్షులు బెల్లం నరసింహారెడ్డిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి

**చిన్నమండెం.జనవరి22 ప్రభాతవార్త**



కొత్తపల్లి గ్రామం నేరేళ్ల వంక పల్లెకు చెందిన మండల టిడిపి అద్యక్షుడు బెల్లం నరసింహారెడ్డి శనివారం రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలిసి ఆదివారం టీడీపి ఇన్‌చార్జ్ రమేష్‌కుమార్‌రెడ్డి ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. త్వరలోనే పూర్తి స్థాయిలో సంపూర్ణ ఆరోగ్యంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గాలివీడు క్లస్టర్ ఇన్‌చార్జ్ సత్యరెడ్డి, సోనిరాజ్ కలీమ్, అమర్‌నాథరెడ్డి, మహబూబ్‌బాష, వెంకటాద్రి, చెన్నక్రిష్ణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## యువత భవిష్యత్తు తెలుగుదేశంతోనే

**-తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చమర్తి జగన్‌రాజు**

**వీరబల్లి.జనవరి22 ప్రభాతవార్త**



రాజంపేట నియోజకవర్గం వీరబల్లి మండలం మూడు గ్రామాలకు చెందిన యువత పూర్వ విద్యార్థులు గ్రామ యువతతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఒదివీడు, మట్లి, తాటిగుంటపల్లి, గ్రామ పంచాయతీలకు సంబందించిన సుమారు 300 మందికి పైగా యువత హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చమర్తి జగన్‌రాజును ఘనంగా సన్మానించి, సాధర స్వాగతం పలికారు. అనంతరం యువతను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ యువత భవిష్యత్తు తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని తెలియజేశారు. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవడం ప్రతి ఒక్కరి భాధ్యత యువత లక్ష్యమని తెలియజేశారు. విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కల్పించడం చంద్రబాబుకే సాధ్యమని చెప్పారు. అంతేకాకుండా టీడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ యువతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. యువగళం పాదయాత్రను విజయవంతం చేసేందుకు యువత ప్రతి ఒక్కరు కదలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సిపి వల్ల రాష్ట్రంలో పాటు యువత భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని యువత ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన వెంట వడ్లమూడి రాంప్రసాద్‌నాయుడు, గల్ఫ్ ఎన్ఆర్ఐ నాగార్జున చౌదరి, నందకుమార్‌నాయుడు, అంజనీకుమార్, మండల ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, సుధాకర్, భాస్కర్‌రాజు, రమణయ్య పాల్గొన్నారు.

## లయన్స్‌క్లబ్ సీనియర్ ప్రతినిధి అబ్దుల్లాకు ఎంజెఎఫ్ అవార్డు

**రాజంపేట అర్బన్, జనవరి 22 ప్రభాతవార్త**



రాజంపేట లయన్స్‌క్లబ్ సీనియర్ ప్రతినిధి ఎస్.అబ్దుల్లాకు ఎంజెఎఫ్ అవార్డు లభించింది. కర్నూలులో జరిగిన లయన్స్‌క్లబ్ సమావేశంలో గవర్నర్ చంద్రప్రకాష్ నుంచి ఈ అవార్డు అందుకున్నట్లు ఎస్.అబ్దుల్లా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంజెఎఫ్ అవార్డు రావడంతో తనపై మరింత బాధ్యత పెంచిందని అన్నారు. రాజంపేట లయన్స్‌క్లబ్‌కు ఈ అవార్డు లభించడం ఎంతో గర్వకారణంగా ఉందని అధ్యక్షుడు ఎస్.సుబ్రమణ్యంరాజు పేర్కొన్నారు.

## అన్నమయ్య జిల్లా గ్రామ విఆర్‌వోల అధ్యక్షుడిగా జి.రమేష్, గౌరవాధ్యక్షుడిగా పి.లక్ష్మీనారాయణ

**రాయచోటి.జనవరి22 ప్రభాతవార్త**



అన్నమయ్యజిల్లా గ్రామ రెవెన్యూ అద్యక్షుడుగా జి.రమేష్‌ను, గౌరవాద్యక్షుడిగా పి.లక్ష్మినారాయణను రాయచోటి పట్టణం లోని మదనపల్లి రోడ్డులో రాజుస్ స్కూల్ నందు నియోజకవర్గ మండలాల విఆర్‌వోల సమావేశంలో నిర్వహించి వారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా జి.రమేష్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా గ్రామ రెవెన్యూ అద్యక్షుడుగా ఎన్నుకున్న ఉద్యోగస్తులు అందరికి ఏ సమస్య వచ్చినా మాకు రావాల్సిన డిమాండ్‌లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని అన్నారు. గౌరవాధ్యక్షుడు లక్ష్మినారాయణ మాట్లాడుతూ శాఖలో ఉన్న ప్రతి ఉద్యోగునికి ఏ సమస్య వచ్చినా ముందుండి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సహాయ అద్యక్షులు బి,సుధాకర్, ఉప అద్యక్షులు ఎన్.సురేష్‌రెడ్డి, మొత్తం 24 మందిని జిల్లా కమిటీలో ఎన్నుకున్నట్లు జిల్లా అద్యక్షుడు తెలిపారు. అన్నమయ్య జిల్లాలోని నియోజకవర్గ మండలాల గ్రామ రెవెన్యూ అధికారులందరూ పాల్గొన్నారన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం

**నందలూరు, జనవరి 22 ప్రభాతవార్త**



నందలూరు మండల కేంద్రంలోని నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1983-87 లకు సంబంధించిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ కలయక కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ దేశాల్లో, రాష్ట్రాల్లో, స్థానికంగా వ్యాపార, ఉద్యోగ వృత్తుల్లో స్థిరపడిన, నాడు చదువు కొంటున్న మిత్రులు వారి కుటుంబ సభ్యులతో ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వ్యక్తుల పరిచయం, ఆత్మీయ పలుకరింపులు అనంతరం నాటి గురువులు సాంబయ్య, వెంకటసుబ్బయ్య, పుల్లయ్య, రామసుబ్బయ్య, చెంచునాగయ్య, కుళాయరెడ్డి, జె.సుబ్బరాయుడు, జయరామరాజు గురువులను వేదికపైకి ఆహ్వానించి పూలమాలలు, శాలువా, జ్ఞాపికలతో ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా 1983-87 విద్యార్థుల తరపున తమ జ్ఞాపకాలను హైస్కూల్ విద్యార్థిని విద్యార్థుల కోసం దాదాపు 2 లక్షల రూపాయలు విలువ చేసే 60 డెస్కులను పాఠశాల ప్రధానోపాధ్యాయ బృందానికి బహుకరించారు. ఈ పూర్వ విద్యార్థుల కార్యక్రమంలో మిత్రులు, వారి వారి రకరకాల ప్రతిభా పాటవాలను కనబరచి వినోదాన్ని పరిచారు. ఆద్యంతం ఆహ్లాదభరితంగా సాగిన కార్యక్రమంలో చివరిగా భావోద్వేగాలతో ఒకరినొకరు వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమానికి పూర్వవిద్యార్థులు డాక్టర్ అరిగె రాంప్రసాద్, జివి నరసయ్య, మునీర్‌అహ్మద్, దార్ల శ్రీనివాసులు ఆచారి, నాగముని, నజీర్, మౌలా, వేణు, బాలాజి, కమాల్, కిషోర్, లక్ష్మినరసయ్య, పద్మజ, జ్యోతి, అరుణ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వాసవీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం


**బద్వేలు అర్బన్, జనవరి 22 ప్రభాతవార్త :**



శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం పురస్కరించుకొని రెండవ రోజు ఆదివారం ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కె.వి.సుబ్బారావు, సెక్రటరి కొలిశెట్టి నాగరాజ మరియు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వాసవీ అమ్మవారికి వివిధ రకాల ప్రత్యేక పూజలను శాస్రోక్తంగా నిర్వహించారు. ఉదయం శాశ్వత ఉభయదాతలకు వాసవీ మాత సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. అనంతరం సాయంత్రం శ్రీ స్వామి తురియానంద సరస్వతి (చిన్మయ మిషన్) కడప వారిచే ప్రత్యేక ప్రవచనాలు, సత్సంగం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ, పరిసర ప్రాం తాల ఆర్యవైశ్యులందరూ విశేష సంఖ్యలో పాల్గొని ప్రవచనాలను తిలకించారు. అనంతరం శాశ్వత ఉభయదారులకు అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం పురస్కరించుకొని వివిధ రకాల తోమాలలతో వాసవీ మాతాకు ప్రత్యేక అలంకరణ చేపట్టారు. పలువురు భక్తులు వాసవీ మాతాను దర్శించుకొని తమ భక్తిని చాటుకున్నారు. ఆర్యవైశ్యుల ఇష్ట దైవమైన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారికి పలువురు భక్తులు కాయా కర్పూరం సమర్పించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ పత్తి నాగేంద్ర ప్రసాద్, చిన్ని చెంచురత్నం, ప్రధానోపాధ్యాయులు ఎ.వి.రమణయ్య, మార్కెట్ యార్డు డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్, కమిటీ సభ్యులు పబ్బతి చక్రపాణి, జొన్నలగడ్డ సుధాకర్, సముద్రాల వెంకటేశ్వర్లు, పసుపుల రవి శంకర్, చాటకొండు వెంకట సుబ్బయ్య, నేలపాటి గోవిందయ్యతో పాటు పలువురు కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీవారి కళ్యాణోత్సవం

**బద్వేలు అర్బన్, జనవరి 22 ప్రభాతవార్త :**



పట్టణంలోని నెల్లూరు రోడ్‌లో వెలసిన శ్రీదేవి భూ దేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో మాఘ మాసం స్వామి వారి జన్మ నక్షత్రం సందర్భంగా దేవాదాయ శాఖ ఏవో శివయ్య, ట్రస్ట్ బోర్డు ఛైర్మెన్ వెంకటరామిరెడ్డి మరియు పలువురు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం శ్రీవారి కళ్యాణోత్సవ కార్యక్రమాన్ని శాస్రోక్తంగా వైభవంగా నిర్వహించారు. కళ్యాణోత్సవంలో పలువురు భక్తులు సాంప్రదాయ దుస్తులు ధరించి స్వామివారి కళ్యాణోత్సవాన్ని తిలకించారు. అనంతరం శ్రీవారి కళ్యాణ విశిష్టతను వేద పండితులు రమేష్ శర్మ, సత్య నారాయణ శర్మ భక్తులకు విరివిరిగా తెలియజేశారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకొని, కాయా కర్పూరం సమర్పించుకొని తమ మొక్కులను తీర్చుకున్నారు.కార్యక్రమంలో ఆలయ సిబ్బంది రాజు, సాంబయ్య, కొండయ్య, బోర్డు సభ్యులు చిన్ని చెంచురత్నం, శివారెడ్డి,రాఘవరెడ్డి, జయరామిరెడ్డి పాల్గొన్నారు.

## బధిర మహిళలు ఎందులోనూ తీసిపోరు

**వేంపల్లె, జనవరి 22, ప్రభాతవార్త :**



బధిర మహిళలు ఎందులోనూ తీసిపోరని రాష్ట్ర బధిర మహిళా ప్రెసిడెంట్ ధరణికుమారి పేర్కొన్నారు. కడపలో ఆదివారం జిల్లాస్థాయిలో బధిర మహిళలకు ముగ్గుల పోటీలు, ఆటల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ పోటీలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బధిర మహిళల్లో ఉత్సాహం నింపేందుకు ఈ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కడప బధిర మహిళల అధ్యక్షురాలు లక్ష్మికిషోర్, ఉపాధ్యక్షురాలు శ్రీవిద్య, కె.సుధారాణి, తదితరులు పాల్గొన్నారు. గెలుపొందిన వారిని బహుమతులు పంపిణీ చేశారు.

## రాజంపేటలో ప్రశాంతంగా కానిస్టేబుల్ రాత పరీక్షలు

**రాజంపేట అర్బన్, జనవరి 22 ప్రభాతవార్త**



రాజంపేటలో 10 పరీక్ష కేంద్రాల్లో ప్రశాంతంగా పోలీసుల రాత పరీక్షలు నిర్వహించారు. ఆదివారం పరీక్ష కేంద్రాల వద్ద గట్టిబందోబస్తు ఏర్పాటు చేశారు. డిఎస్‌పి శివభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిఐలు, ఎస్ఐలు పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షలు రాసేందుకు అభ్యర్థులు భారీఎత్తున హాజరయ్యారు. బోయనపల్లె అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డువారు నిర్వహించిన కానిస్టేబుల్ నియామక రాతపరీక్షకు 4138 మంది అభ్యర్థులకు గాను 3548 మంది అభ్యర్థులు హాజరు కాగా 590 మంది గైర్హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవి నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం నుంచే కట్టుదిట్టమైన ఏర్పాట్లతో పోలీసుశాఖ భద్రత పర్యవేక్షణలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం జరిగిందన్నారు. అభ్యర్థులు ఎటువంటి అసౌకర్యాలకు గురికాకుండా అన్ని వసతులు కల్పించామన్నారు. కానిస్టేబుల్ రాత పరీక్షలకు తమ కళాశాలను ఎన్నుకోవడం ఆనందంగా ఉందని కళాశాల వ్యవస్థాపకులు చొప్పా గంగిరెడ్డి, ఛైర్మన్ డాక్టర్ సి.రామచంద్రారెడ్డి, వైస్ ఛైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చొప్పా అభిషేక్‌రెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు. పరీక్ష ప్రశాంతంగా జరిగినందుకు కృషి చేసిన కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎం.మారుతీప్రసాద్, అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.ఎన్. రంగనాథ్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని కళాశాల యాజమాన్యం అభినందించారు.

## బాల్యదశ నుంచి మృధుస్వభావి వడ్డి మనోజ్ మృతి బాధాకరం

**కన్నీటిపర్యంతమైన ఎమ్మెల్యే కొరముట్ల**

**రైల్వేకోడూరు రూరల్, జనవరి 22 ప్రభాతవార్త**



బాల్యదశ నుంచి వడ్డి మనోజ్ తనకెంతో అత్యంత ఆత్మీయుడని రైల్వేకోడూరు శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. ఆదివారం వడ్డి మనోజ్‌కుమార్ మృతదేహాన్ని చూసి ఆయన చలించిపోయారు. క్రైస్తవ దేవాలయంలో మనోజ్ మృతదేహానికి నివాళులర్పిస్తూ కొద్దిసేపు మైకు ద్వారా మాట్లాడుతూ కొన్నింటిని ఆపుకోలేక దు:ఖాన్ని కొరముట్ల శ్రీనివాసులు దిగమింగారు. కొద్దిసేపటికి ఆయన మాట్లాడుతూ వడ్డి మనోజ్ ఎంతో ఆత్మీయుడని, తనను మామా మామా అంటూ ప్రతినిత్యం స్మరించేవాడని ఆయన మృతి జీర్ణించుకోలేకపోతున్నానని అన్నారు. తాను ఎంపిడిఒ కార్యాలయంలో వచ్చినప్పుడు మనోజ్ చూపిస్తున్న ప్రేమాభిమానం మరువరానివని, అన్నివేళల్లో తనకు అందుబాటులో ఉంటూ ఎన్నో సూచనలు, సలహాలను అందజేశారని, ఒక్కసారిగా మనోజ్ మృతి తట్టుకోలేకపోతున్నానని మైకును ఫాస్టర్‌లకు అందజేశారు. మండల ఉపాధ్యక్షుడు రామిరెడ్డి ధ్వజారెడ్డి మాట్లాడుతూ ప్రతి విషయంలోను వడ్డి మనోజ్ ఎంతో వినయంగా ఉద్యోగ విధులను నిర్వహిస్తూ అన్నివేళల్లో అందుబాటులో ఉండేవాడని, ప్రతి ఉద్యోగి పట్ల గౌరవాన్ని చూపిస్తూ చక్కటి మన్ననలను మనోజ్ పొందారని, ఇటీవలే సాధారణ బదిలీల్లో ఓబులవారిపల్లె మండలానికి వెళ్లి త్వరలోనే రైల్వేకోడూరు మండల అభివృద్ధి కార్యక్రమానికి వస్తారన్న ఆలోచనలో ఉండగా విధి వక్రీకరించిందని ఆయన మరణించడం దారుణమని ఆ కుటుంబానికి అందుబాటులో ఉంటూ అన్ని సేవలను అందజేస్తామని ధ్వజారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా రైతు సలహామండలి ఛైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త ఎం.విశేవశ్వర్‌నాయుడు, వైసిపికి చెందిన ప్రముఖులు నాయిని హరిక్రిష్ణారెడ్డి, దొమ్మరాజు సుబ్రమణ్యంరాజు, దార్ల చంద్రశేఖర్, గోపి, రమణారెడ్డి, దొంతిరెడ్డి రాజారెడ్డి, వైస్ అన్వర్‌బాషా, జడ్‌పిఇసి పాలెంకోట రత్నమ్మ, భుజంగేశ్వర ఆలయ ఛైర్మన్ పోకల సుబ్బరాయుడు, రైల్వేకోడూరు మండలంలో ఉన్న ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు. అనంతరం మనోజ్ మృతదేహాన్ని నివాస స్థలమైన రెడ్డివారిపల్లె స్వగృమానికి పార్థివ దేహాన్ని క్రైస్తవ స్మశానవాటికకు తరలించారు.

## రోడ్డు భద్రతా వారోత్సవాలలో డ్రైవర్లకు పరీక్షలు

**బద్వేలు, జనవరి 22 ప్రభాతవార్త :**



34వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలలో భాగంగా డ్రైవర్లకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రావు మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా భద్రతా వారోత్సవాలను బద్వేలు పరిసర ప్రాంతాలలో నిర్వహిస్తూ డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఆదివారం జాతీయ రహదారిపై వాహనాల డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ తదితర పరీక్షలు నిర్వహించడం జరిగింది. వాహన డ్రైవర్లు మద్యం సేవించి వాహనం నడపకూదని, దీని వలన అనేక ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. డ్రైవర్లు సురక్షితంగా గమ్య స్థానాలు చేరే విధంగా ఏకాగ్రతతో వాహనాలు నడపాలన్నారు. డ్రైవర్లపైన వారి కుటుంబాలతో పాటు ఇతరుల ప్రాణాలు కూడా ఆధారపడి ఉంటాయి కాబట్టి ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని ఎంవిఐ శేఖర్‌రావు డ్రైవర్లకు అవగాహన కల్పించారు.

## గర్భిణీ మహిళలు ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**– డా॥ కోటా సుమన్**

**బద్వేలు అర్బన్, జనవరి 22 ప్రభాతవార్త :**



బద్వేలు ప్రాంతంలోని పేద ప్రజలను దృష్టిలో పెట్టుకొని సంజీవని మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో గైనకాలజి సంబంధిత సాధారణ ప్రసవాలు, శస్త్ర చికిత్సలు, గర్భ సంబంధిత ఆపరేషన్లు ఉచితంగా చేపట్టడం జరుగుతుందని సంజీవని మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డా॥ కోటా సుమన్, వై.వి.సరస్వతి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ హాస్పిటల్‌లో గైనకాలజిస్ట్ డా॥ సముద్రాల పవిత్ర ఆధ్వర్యంలో గర్భిణీ మహిళలకు ఉచిత వైద్య సేవలందించేందుకు కృషి చేయడం జరుగుతుందని, కావున గర్భిణీ మహిళలు అవసరమైన వైద్య సేవలను ఉచితంగా సద్వినియోగం చేసుకో వాలని వారు తెలియజేశారు.

## పర్యాటకులను ఆకట్టుకుంటున్న ప్రకృతి అందాలు

**హార్సలీహిల్స్ సందడే సందడి**

**బి.కొత్తకోట, జనవరి 22, ప్రభాతవార్త:**

ప్రముఖపర్యాటకకేంద్రమైన హార్సిలీ హిల్స్ లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. సాధారణంగా వారాంతపు రోజులలో పర్యాటకుల సందడి అధికంగానే ఉంటుంది.అయితే ఈ ఆదివారం మరింత అధిక సంఖ్యలో పర్యాటకులు రావడంతో కొండ కిటకిటలాడింది. కొండపై అటవీ శాఖ పరిధిలోని చిల్డ్రన్స్ పార్కు, ముసళ్ళ పార్కు,. టూరిజం సముదాయంలోని అడ్వెంచర్ పార్కు, స్విమ్మింగ్ పూల్, గవర్నర్ బంగ్లా,ప్రాంతాలను సందర్శించారు. గాలి బండ, వివ్ పాయింట్ ల వద్ద నుంచి చూస్తే కనిపించే ప్రకృతి అందాలు కొండలు ,లోయలు పర్యాటకులకు కనువిందు చేశాయి. గత రెండు సంవ్సరాలుగా వర్షాలు సకాలంలో కురుస్తుండడంతో కొండపైన, కొండ చుట్టూ గల ప్రాంతాలు పచ్చదనంతో కళకళలాడుతోంది. కొండపై నుంచి చూస్తే కనిపించే గుట్టలు,లోయలు అందమైన లోకేషన్స్ పర్యాటకులను అబ్బుర పరుస్తున్నాయి. ఘాట్ రోడ్డు కిరువైపులా అడవి పూల అందాలు పక్షుల కిల కిల రావాలు పర్యాటకులను ఆకట్టుకున్నాయి.